# దుఃఖ నివారణ

భగవంతుడు సృష్టించిన ఈ ప్రపంచములో ఎటుచూచినా దుఃఖాలు, బాధలతో నిండియున్నట్లు మనకు కనపడుతుంది. నిజానికి ఈ ప్రపంచంలో పుట్టిన జీవులకు దుఃఖాలు, కష్టాలు వుంటాయి. భగవంతుడు జీవరాశులన్నిటికంటే భిన్నముగా మానవునకు మనస్సును ప్రసాదించి విశిష్ట జీవిగా తీర్చిదిద్దాడు. మానవుడు తన వివేకముతో దివ్య లక్షణాలను పెంపొందించుకొనగలడు. మనమందరము భగవంతునినుండే వచ్చినాము కనుక మనకు తెలిసినా తెలియకపోయినా మనమందరము పూర్తిగా భగవంతునిపై ఆధారపడియున్నాము. మనం ఈ ప్రపంచంలోకి వచ్చినప్పటినుండి దుఃఖాలు, బాధలు లేకుండా ఎప్పుడూ లేము. కనుక మనందరికీ మూలమైన భగవంతునితో ఏకత్వము సాధించేవరకు కూడ మనం వాటినుండి విముక్తులము కాము. కనుక భగవంతునితో సంపూర్ణమగు ఏకత్వమును (లయావస్థను) సాధించుటయే మన నిజ జీవిత లక్ష్యముగా భావించాలి. అదియే స్వస్వరూప జ్ఞానప్రాప్తి. ఈ విధముగా మన అస్థిత్వము లేక ఉనికి లేకుండా చివరకు మనము చేరవలసిన స్థితి శూన్య స్థితియే. అట్టి స్థితిని పొందుటయే దుఃఖ నివారణకు ఏకైక మార్గము.

సాధారణముగా చాలామంది ప్రజలు యిటువంటి సమున్నత నిజ జీవిత లక్ష్యమును గురించి తీవ్రముగా ఆలోచించరు. ఎక్కువమంది ప్రజల జీవితాశయములు ప్రాపంచిక దృష్టితో వుంటాయి. అంటే సంపదలు సమకూర్చుకొనుట, గొప్ప వ్యక్తులుగా పేరు ప్రఖ్యాతులు గడించుట, తాను తన కుటుంబ స్వలాభము కొరకు మాత్రమే ప్రయత్నించుట యందు దృష్టి నిలిపి సంకుచిత బుద్ధితో వారు తమ జీవితములను గడుపుతూ మరణిస్తారు. కాని వారి జీవిత సమస్య మరణముతో అంతమొందదు. ఈ జన్మకు పూర్వము అనేక జన్మలు అనేక రూపములలో కలిగినట్లే మరణానంతరము యితర జన్మలు కలుగును. ఈ విధముగా జనన మరణ చక్రభ్రమణము నిరవధికముగా సాగిపోవుచుండును.

ఈ విధముగా అనేక జన్మపరంపరలనుండి మనమే మనస్సును చంచలమైనదిగాను, అస్థిరమైనదిగాను తయారుచేసి వివిధ రకాల కార్యకలాపములలో పాల్గొనేటట్లు చేసి అనేక రకాలుగా ఏర్పరచుకొన్న స్థూలత్వపు పొరల ఫలితంగా వివిధ సంస్కారాలు స్వయముగా ప్రోగుచేసుకొన్నాము. ప్రస్తుత ప్రపంచంలో ఆధునిక శాస్త్ర సాంకేతిక పురోగతి వలన ఆధునిక సౌకర్యాలు సమకూరుటవలన భౌతిక జీవన విధానములో పలు మార్పులు సంభవించి మనస్సు క్రమశిక్షణా రాహిత్యముతో వివిధ కోరికలు అదుపుతప్పి పెరుగుటవలన ప్రజలు వాటిని తీర్చుకొనుటకు నిరంతరము తాపత్రయ పడుతూ ప్రస్తుత జన్మలో మరిన్ని సంస్కారాలు ఏర్పరచుకొంటున్నారు. ఈ విధముగా మనము స్వయముగా ఏర్పరచుకొన్న సంస్కారాల

వలన కోరికలు పెరుగుతాయి. కోరికల వలన దుఃఖములు పెరుగుతాయి. దుఃఖములనుండి బయటపడుటయే మన ప్రధాన లక్ష్యమని అనుకొంటాము. కాని బాధలు, దుఃఖములు కేవలము వ్యాధి లక్షణములేయని, వ్యాధి వేరొకచోట ఎక్కడో యుండునని మనము విస్మరిస్తాము. చాలామంది బాధలు, దుఃఖములనుండి తక్షణము బయట పడుటకు తాత్కాలిక మార్గములు అన్వేషిస్తూ భ్రమపడుతూ వారికి తోచినట్లు వివిధ స్వామీజీలను, బాబాలను ఆశ్రయించి పరిష్కారము చూపించమని ప్రాధేయపడతారు. మరికొంతమంది తమ బాధలు, దుఃఖములనుండి బయటపడి వివిధ కోర్కెలను సాధించుకొనుటకు తమ గృహములలోను, వివిధ దేవాలయాలకు వెళ్ళి అక్కడ గల దేవుళ్ళను, దేవతలను వివిధ రకాల పూజలతో ఆరాధిస్తారు. కాని మనముందున్న జీవిత సమస్య బాధలు, దుఃఖములనుండి తప్పించుకొనుట కాదు. బాధలు, దుఃఖములకు అసలు కారణమైన సంస్కార బంధమునుండి విముక్తి పొందుట. సంస్కార బంధమునుండి విముక్తి పొందుటయే ముక్తి. అంటే జనన మరణ చక్ర బంధమునుండి విముక్తి. అప్పుడే దుఃఖ నివారణ కలుగుతుంది.

కనుక అనేక జన్మపరంపరలనుండి మనమేర్పరచుకొన్న సంస్కారాల సముదాయమును సమూలముగా నిర్మూలించాలి. అంటే మన సంస్కారాల ఫలితంగా మన సృష్టియైన స్వార్థము, అహంకారము, మమకారము, అసూయ, ద్వేషము, దురాశ, అపనమ్మకము మొదలైన చెడు లక్షణాలతో మనస్సు క్రమశిక్షణారాహిత్యమువలన తప్పుడు మార్గములో పయనించే భౌతిక వాదముతో కూడిన జీవన విధానమునుండి బయటపడాలి. అంటే మన సృష్టిని అంతమొందించుకొని నిజజీవితమైన ఆధ్యాత్మిక జీవన విధానమునకు మరలాలి. ఆధ్యాత్మిక జీవన విధానములోని నిజ జీవిత విలువలను, నియమములను గుర్తించి అవగాహన చేసుకొని వాటిని ఆచరించుటకు వీలగునట్లుచేసి నిజజీవిత లక్ష్యసాధనకు తోడ్పడు సరియైన ఆధ్యాత్మిక సాధన చేయాలి.

మనమందరము గృహస్థులము. గృహస్థ జీవితమున సంపదలు, ప్రాపంచిక సంబంధములు అత్యావశ్యకములు. కాని సంపదలపై వ్యామోహము పెంచుకొనరాదు. సామాన్య గృహస్థ జీవితంలో తన ప్రాపంచిక బాధ్యతలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక సాధన ఆచరిస్తూ దైవచింతనలో ఎల్లప్పుడూ నిమగ్నమై వుండుట సాధ్యం కాదని చాలామంది అభిప్రాయం. ఈ రెండు పరస్పర వ్యతిరేకములు అయినందువలన వాటిని ఒకేసారి అనుసరించటం సాధ్యం కాదనే అభిప్రాయం సరైనది కాదు. జీవిత లక్ష్యమును సాధించుటకు గృహస్థ జీవితము ఆటంకమేమియు కాదు. మన గురుదేవులు పూజ్య శ్రీ రామచంద్రజీ మహారాజ్ (పూజ్య బాబూజీ మహారాజ్) ప్రాణాహుతితో కూడిన రాజయోగ సాధనను గృహస్థ జీవితములో ప్రస్తుత

కాలావసరాలకు అనువుగాను, సామాన్య మానవుని సాధారణ జీవిత విధానానికి అనుగుణంగాను తగినట్లుగా మార్పులు చేసి పరిపూర్ణమొనరించి ప్రపంచ మానవాళికి ప్రసాదించారు.

గురుదేవులు ప్రసాదించిన ప్రాణాహుతి సహిత ధ్యానమును మన సంస్థచే నిర్దేశించబడిన సాధనా నియమములను, పద్ధతులను పాటించుచూ గురుదేవులే దైవమని భావించి వారియందు పరిపూర్ణ విశ్వాసము, శ్రద్ధ, భక్తి, ప్రేమలను కలిగియుండి ఆత్మవిశ్వాసముతో, దృఢదీక్షతో, మిక్కిలి శ్రద్ధతో క్రమపద్ధతిలో మనము సాధనను కొనసాగించినట్లైతే గురుదేవుల కృపతో ఆధ్యాత్మికముగా పురోగమిస్తూ వివిధ దశలలో కలుగు అనుభవాలను అనుభూతి చెందుతూ క్రమముగా పరిణామము చెందుతూ వుంటాము. తత్ఫలితముగా మన జీవన విధానములో క్రమముగా మార్పులు చోటుచేసుకొని ఆధ్యాత్మిక జీవన విధానములోని సహజమైన నిజ జీవిత విలువలను, నియమములను, సిద్ధాంతములను అవగాహన చేసుకొని వాటిని ఆచరిస్తాము. అదే క్రమముగా మన సాధన కొనసాగుతూ ఆధ్యాత్మికముగా వికాసము చెందుతూ చివరగా మన వ్యక్తిగత సృష్టిని అంతము చేసుకొని అస్థిత్వమును కోల్పోయి శూన్యస్థితికి వస్తాము. ఈ స్థితియే మనము చివరకు చేరవలసిన స్థితి. ఇదియే మన నిజ జీవిత లక్ష్య మైన స్వస్వరూప జ్ఞాన ప్రాప్తి స్థితి. ఈ స్థితిని పొందుట పూజ్య గురుదేవుల కృపతోనే సాధ్యము. ఈ విధముగా మన నిజ జీవిత లక్ష్యమును సాధించి దివ్యలక్షణాలైన ప్రశాంతత, పరహితము, పరస్పర సహకారము, ఐకమత్యము, త్యాగము, సేవాతత్పరత మొదలగునవి పెంపొందించుకొని సదా గురుదేవుల సేవలో నిమగ్నమై దివ్యజీవనము గడుపుతాము. ఇట్లు మనమంతా పరిణామము చెంది పూజ్య గురుదేవుల చైతన్యములో వుంటూ మన గృహస్థ ధర్మాలు, బాధ్యతలు నెరవేరుస్తూ, సమాజమునకు హితము చేకూర్చే కార్యములు కొనసాగిస్తూ, సర్వమానవాళికి ఆధ్యాత్మిక సేవ కొనసాగిస్తాము. మనమీ స్థితిని పొందినప్పుడు కోరికలనుండి విడుదల పొందిన వారమగుదుము. కోరికలు అంతమొందుటతో సంస్కారములు ఏర్పడుట నిలిచిపోవును. మన జీవితకాలములో పూర్వమునుంచి వున్న సంస్కారములను అనుభవించి క్రమముగా పోగొట్టుకుంటాము. ఈ విధముగా మన సాధన పూజ్య గురుదేవుల అపార కృపవలన మాత్రమే సాధ్యమై మనమేర్పరచుకున్న సంస్కార బంధములనుండి విముక్తి పొంది నిజజీవిత లక్ష్య మైన స్వస్వరూప జ్ఞానప్రాప్తిని సాధించి భగవత్కృప వలన లభించిన మానవ జన్మను సార్థకము చేసుకొనగలము. ఈ విధముగా మనము జనన మరణ చక్ర బంధమునుండి విముక్తి పొందుటతో మనకు శాశ్వతముగా దుఃఖ నివారణ కలుగుతుంది. కనుక గురుదేవులు పూజ్య శ్రీ రామచంద్రజీ మహారాజ్ ప్రసాదించిన ప్రాణాహుతి సహిత ధ్యానమును ఆచరించుట సమస్త మానవాళికి శుభము.